## క్లుప్తంగా

### నేడు వారపు సంత వేలం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం వారపు సంతకు శుక్రవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు డీడీఓ మోహన్‌కుమార్ గురువారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంత వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. రూ.80 వేలు తక్కువ లేకుండా పాడుకుని సంతను దక్కించుకోవచ్చని వెల్లడించారు.

### గృహ నిర్మాణ పనులు పరిశీలన


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: జిల్లా హౌసింగ్ పీడీ పద్మనాభం గురువారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. పనులు పూర్తి కాని వారితో అధికారులు మాట్లాడి పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరి డివిజన్ ఇఇ శంకరప్ప, మండల ఏఈ శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### 15న ఉచిత కంటి పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గాంధీరోడ్డులోని లిటిల్ రోస్ పాఠశాలలో ఈనెల 15న ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు, ఆపరేషన్‌లు నిర్వహిస్తారన్నారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు. వివరాలకు 9440266653 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

### ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించండి


ఓటరు నమోదుపై సూచనలు ఇస్తున్న ఆర్డీవో

నింద్ర: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటరు వివరాలను పరిశీలించి నమోదు చేయాలని నగరి ఆర్డీఓ వేంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇరుగువాయి, పాదిరి కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు చేయడానికి బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఇంటి నెంబరు ద్వారా ఓటరును నమోదు చేయాలన్నారు. ఇంటి పన్నుల ఆధారంగా ఇంటిలోని ఓటరు వివరాలు నమోదు చేయాలన్నారు. ఫారం –6, 7, 8 సంబంధించిన సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నింద్ర డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహార ఆవశ్యకతపై అవగాహన


గర్భవతులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

విజయపురం: మండలంలోని గంగమాంబపురంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరి ప్రాజెక్టు సీడీపీవో కృష్ణవేణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషక విలువలపై అవగాహన అవసరమని తెలిపారు. పోషకాహార లోపం తలెత్తితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగాలంటే విధిగా పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, గర్భవతులు పాల్గొన్నారు.

### దుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు

–అక్టోబర్ 3 నుంచి 13 వరకు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని గిరింపేటలో వెలసిన శ్రీదుర్గాంబ ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 13వ తేది వరకు దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మునిశేఖర్ తెలిపారు. 3వ తేదీ మహచండి హోమం, మహలక్ష్మీ అలంకారం ఉంటుందన్నారు. 4న చాముండేశ్వరిదేవి, 5న శ్రీలలితాదేవి, 6న శ్రీపార్వతిదేవి, 7న శ్రీకాత్యాయనిదేవి, 8న సరస్వతి దేవి, 9న శ్రీ మహిషాసురమర్దిని, 10న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారం, 12న దుర్గాదేవి పవళింపు సేవ, 12న శ్రీపుష్పరథంలో శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారం ఉంటుందన్నారు. 13వ తేది వసంతోత్సవంతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని, అంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రశ్నించే అధికారం...
# పౌరుడి హక్కు



– ప్రజల చేతిలో పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం

వెదురుకుప్పం: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతరత్రా అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవడం కోసం చాలా మంది ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోతుంటారు. ప్రతి రోజూ పనిబాటా వదిలేసి నిరీక్షిస్తూ సమయాన్ని వృథా చేసుకుంటుంటారు. అయితే తాము కోరిన సమాచారం పొందడానికి ఓ చట్టం ఉందని చాలా మందికి తెలియక పోవచ్చు. కేవలం రూ.10తో దరఖాస్తు చేసుకుంటే గ్రామ సచివాలయం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ఎలాంటి సమాచారమైనా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు అనే చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరుడు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. ఈ చట్టం తీరుతెన్నులను పరిశీలిద్దాం.

**ప్రజల చేతిలో పాశుపతాస్త్రం**

ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారమే సమాచార హక్కు చట్టం. ఈ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని, కావాల్సిన వివరాలు తెలుసుకోవచ్చు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం ఇతరత్రా అంశాలను అడగవచ్చు.

**సమాచార అధికారి వివరాలు ఉండాలి**

సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయ పౌర సమాచార అధికారి, సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు ప్రజలకు కనిపించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

**సమాచారం కోరే విధానం**

సమాచారం కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో సమాచార అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తు తెల్ల పేపర్‌పై రాస్తే సరిపోతుంది. రాయడం తెలియక పోయినా, సమాచారం సక్రమంగా అడిగే అవగాహన లేకపోయినా పౌర సమాచార అధికారి వద్ద తగిన సహాయం తీసుకోవచ్చు. కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం, కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు, వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజాప్రయోజనాలకు సంబంధించిన వివరాలు అయితే తప్పకుండా ఇవ్వాలి.

**తెల్లకార్డుదారులకు ఫీజు లేదు**

తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి దరఖాస్తు రుసుము ఉచితం. గ్రామ స్థాయి సంస్థల్లో అడిగే సమాచారానికి దరఖాస్తు రుసుము లేదు. మండల స్థాయిలో అయితే రూ.5, జిల్లా స్థాయిలో అయితే రూ.10 రుసుము చెల్లించాల్సి ఉంది. ఈ రుసుమును డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో చెల్లించవచ్చు. అడిగిన సమాచారం మేరకు సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వడానికి అయ్యే ఖర్చును దరఖాస్తు చేసుకున్నవారు చెల్లించాలి. సాధారణంగా దరఖాస్తు ఫీజుతోపాటు ముద్రణ రూపంలో సమాచారం కోరితే పేజీకి రూ.2 చొప్పున ఫొటోస్టాట్ ఖర్చులు, ఫ్లాపీకి రూ.50, సీడీకి రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం. గంట తర్వాత ప్రతి గంటకూ రూ.5 చొప్పున చెల్లించాలి.

**సమాచారం పొందే అంశాలు..**

సమాచార హక్కు చట్టం ద్వారా అనేక అంశాలపై అధికారులను కోరే హక్కు ఉంది. పత్రాలు, మెమోలు, ఈ–మెయిల్, రికార్డులు, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలపై అడగవచ్చు. అదేవిధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్‌బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, నమూనాలు, తనిఖీ రికార్డులు మొదలైనవి ఉండొచ్చు. ఇలాంటి సమాచారాలు ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. ఉదాహరణకు రేషన్ డీలర్లకు సంబంధించి రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, వాటి వినియోగం, లబ్ధిదారుల వివరాలు, సీఎం సహాయ నిధి వివరాలు, జిల్లా ప్రజా ప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వినియోగం తదితర వివరాలు కాగితాల రూపంలోనైనా ఆన్‌లైన్ సమాచారం అయితే సీడీలు, వీడియోల రూపంలో కూడా పొందవచ్చు.

**అవగాహన కల్పించాలి**



సామాన్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రజలు సమాచారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే సందర్భాలు అనేకం. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న గడువులోగా వివరాలు ఇవ్వాలి. అధికారుల కాలయాపన చేయకుండా సహకరించాలి. కార్యాలయాల వద్దకు దరఖాస్తుదారులను తిప్పుకోకూడదు. – బట్టే సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ, వెదురుకుప్పం

**గడువులోగా సమాచారం ఇవ్వాలి**



సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువులోగా అందజేయాలి. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యులుగా ఉండాల్సి వస్తుంది. దరఖాస్తుదారుడి ఫిర్యాదు మేరకు కోర్టు చట్టరీత్యా చర్య తీసుకునే ఆస్కారం ఉంది.

– బి. రామచంద్రారెడ్డి, న్యాయవాది

## శుభ దిన తిథి భోజనం స్ఫూర్తిదాయకం


విద్యార్థులకు విందు భోజనం వడ్డిస్తున్న హరిత, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ప్రత్యేక శుభ తిథులలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు విందు భోజనం లేదా అల్పాహారం అందించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తిథి భోజనం కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. గురువారం ఆ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని కె.హరిత తన కుమారుడు పునీత్ జన్మదిన వేడుకను పురస్కరించుకుని 155 మంది విద్యార్థులకు విందు భోజనం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు, యువత, గ్రామస్తులు, దాతలు, అధికారులు తమ దాతృత్వాన్ని చాటుకోవడానికి శుభదిన్ తిథి ఒక సువర్ణ అవకాశం అన్నారు. దాత హరిత మాట్లాడుతూ తమ దాతృత్వాన్ని చాటుకోవడానికి ప్రభుత్వం ఇలాంటి అవకాశాన్ని అందించడం అదృష్టంగా భావిస్తున్నామని, విద్యార్థులు కూడా తమ కుటుంబ సభ్యులుగా సహకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు మధ్యాహ్నం విందు భోజనాన్ని అందించి కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు.

## కూలిపోయే స్థితిలో తాగునీటి ట్యాంక్


కె.వెంకటాపురంలో కూలిపోయే స్థితిలో ఉన్న నీళ్ల ట్యాంక్

గంగాధరనెల్లూరు: మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంక్ కూలిపోయే స్థితిలో ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కలిజవేడు పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసిన ఆనందనాయుడు సుమారు 40 క్రితం ట్యాంక్ నిర్మించారని స్థానికుల పేర్కొన్నారు. అయితే ఈ ట్యాంక్ చుట్టూ పైన పగుళ్లు ఏర్పడడంతోపాటు మొక్కలు మొలిచి ప్రమాదకరంగా మారింది. గడప గడపకు వచ్చిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలిజవేడు సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీకి వచ్చినపుడు ఆయన దృష్టికి కె.వెంకటాపురం తాగునీటి ట్యాంక్ విషయాన్ని వివరించారు. ప్రమాదకర ట్యాంక్ పరిస్థితిపై స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని అప్పుడు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం మారడంతో అధికారులు మూలన పడవేశారు. ప్రస్తుతం స్థానిక నేతలతోపాటు ప్రజలు నూతన ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కవాతు నిర్వహిస్తున్న సీఐ, సిబ్బంది

బంగారుపాళెం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. గురువారం సాయంత్రం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలకు అనుసరించి వాహనాలు నడపాలన్నారు. మండల కేంద్రంలో దుకాణాల ముందు అస్తవ్యస్తంగా వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.







### వైభవం..బ్రహ్మోత్సవం

కాణిపాకం: వరసిద్ధుని వినాయకుని బ్రహ్మోత్సవాల్లో గురువారం వైభవంగా జరిగాయి. ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు క్షీరాభిషేకం చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆస్థాన మండపంలో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరై కళాకారులను సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

### సాయినాథునికి విశేష పూజలు



వెదురుకుప్పం: మండలంలోని టీకేఎం పురం గ్రామంలో కొలువైన శ్రీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో బాబాను మేల్కొలిపి కాగడ హారతి, కర్పూర హారతి చేపట్టారు. నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. తదుపరి భక్తిశ్రద్ధలతో బాబాకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం ఉభయదారులు తెచ్చిన వస్త్ర పుష్పాలతో బాబాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం హారతి అనతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాను పుష్ప పల్లకిపై వేంచేపు చేసి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

### పాఠశాలల సముదాయాలకు రీమ్యాపింగ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

నగరి: పాఠశాలల సముదాయాలను రీ మ్యాపింగ్ చేయాలని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధిత వివరాలు క్షుణ్ణంగా లెక్కించాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు వారి పాఠశాల సముదాయాన్ని రీ మ్యాపింగ్ చేసి, అందించాలన్నారు.

### ప్లాస్టిక్‌ను నిషేధించాలి


అరగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లె: పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఇందులో అందరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం అరగొండలో పర్యావరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని నిర్మూలించు, పర్యావరణాన్ని కాపాడు, ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు, చెట్లే ప్రగతికి మెట్లు– చెట్లు నరికితే ఇక్కట్లు, ఇంధనం వాడకం తగ్గించు– ప్రకృతి కాలుష్యం తగ్గించు, మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి అనే నినాదాలతో అరగొండ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాలుష్య రహిత రాష్ట్రం కోసం ప్రతిఒక్కరూ పాటుపడదామని భవిష్యత్తు తరాల బాగుకోసం ఆకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని కోరారు. ర్యాలీలో వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు రెడ్డెమ్మ, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, అరగొండ అపోలో నర్సింగ్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణనాథునికి ఘనంగా పూజలు


శివాలయం వీధిలో భారీ విగ్రహానికి పూజలు

కార్వేటినగరం: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గురువారం 6వ రోజు శివాలయం వీధిలో రూ.1.80 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహానికి యువత ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి రోజు వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. క్రేన్‌తో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం విశేషం. భక్తులు అన్నప్రసాదాలను పంచి, మొక్కులు తీర్చుకుంటున్నారు. శివాలయం వీధిని విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


మధ్యాహ్న భోజనాన్ని రుచి చేస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం కావేరిరాజుపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, గుడ్లు ప్రతి రోజు సక్రమంగా పెట్టాలని తెలిపారు. ముందే బియ్యాన్ని నీటితో కడిగిన తరువాతనే అన్నం చేయాలన్నారు. రసం, సాంబార్‌కి తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం జయలక్ష్మి తదితులు ఉన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భారతి

పాలసముద్రం: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవించి తల్లీబిడ్డ ప్రాణాలకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, ఎస్‌ఐ భారతి తెలిపారు. గురువారం పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ భారతి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలికలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నా 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులకు బాలల హక్కులను తరవుగా వివరించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, టీబీ, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మురుగేష్, మహిళ పోలీస్, ఆశా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుతో అధిక లాభాలు


పూల సాగుపై శిక్షణ కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ సుధాకర్

పెనుమూరు(కార్వేటినగరం): పూలతోటలను ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో సాగుచేస్తే అధిక లాభాలు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ సుధాకర్ తెలిపారు. గురువారం మండల పరిధిలో కేవీకే ఆత్మ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి వేప పిండి, వానపాముల ఎరువులు, జీవ సంబంధిత ఎరువులు వినియోగించడం ద్వారా పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. అంతేకాకుండా సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల ద్వారా రైతుకు సాగు ఖర్చు తగ్గి ఆశించిన ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చిత్తూరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీలత, కేవీకే శాస్త్రవేత్త సుహర్లత తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత భద్రతపై విద్యార్థులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరి: మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, మహిళల భద్రత అనే అంశాలపై విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అవగాహన కల్పించారు. గురువారం కళాశాలలో సెట్విన్, నగరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కళాశాల రెడ్‌రిబ్బన్ క్లబ్ యూత్, రెడ్‌క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు, అధికారులు కూడా అవగాహన లోపంతో సైబర్ మోసాలకు బలి అవుతున్నారన్నారు. సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం యుక్త వయస్సులో సంతోషంగా ప్రారంభమై, మధ్య వయస్సులో జీవితం విషాదంతో అంతమతుందన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ శ్రీకృష్ణా నాయక్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ స్వాతి, అధ్యాపకులు రమేష్, లాల్‌బాషా, కుమారి హరికృష్ణ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## యూరియా ద్రావణం పిచికారీ చేయాలి


పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీ ఉమ

తవణంపల్లె: వర్షాభావ పరిస్థితులు వల్ల వాడుతున్న వేరుశనగ పంటకు రైతులు యూరియా ద్రావణం పిచికారీ చేసి కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఉమా సూచించారు. గురువారం మండలంలోని టి.పుత్తూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ వర్షాభావం వల్ల ఎండుతున్న వేరుశనగ పంటకు నీటి వసతి ఉన్న రైతులు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. వేరుశనగలో తెగుళ్లను అరికట్టేందుకు పొలం చుట్టూ జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలను వేయడం ద్వారా రసం పీల్చే పురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. వాడుతున్న వేరుశనగ పంటకు ఎకరాకు లీటరు నీటిలో 20 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ ప్రవీణ్, వీహెచ్‌ఏ శ్రీధర్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా బావి


జాతీయ రహదారి పక్కనున్న బావి

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యం గ్రామం సమీపంలో బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న బావి ప్రమాదకంగా మారింది. వాహనదారులు అదుపు తప్పి పడితే ప్రమాదం తప్పదు. రోడ్డు పక్కన ఉన్న బావికి ప్రహరీ కూడా లేదు. నిత్యం రోడ్డుపై బస్సులు, ద్వి చక్ర వాహనాలు వందలాదిగా ప్రయాణం సాగిస్తుంటాయి. ప్రభుత్వ కళాశాలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు సైకిల్‌పై వెళ్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుంలోనని భయంతో పెట్టుకుని వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బావికి ప్రహరీ కట్టే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.